AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in


10-7-2025 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2

చెరువు కాదది..

2


2
భక్తి శ్రద్ధలతో గురుపౌర్ణమి

## 20 టీఎంసీలకు చేరిన ఎస్సారెస్పీ నీటిమట్టం



**అక్షరటుడే, ఆర్మూర్:** ఎస్సారెస్పీ జలాశయంలోకి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎగువన మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో పాటు, ఇటీవల కురిసిన వర్షాలకు ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రస్తుతం 6,100 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి వస్తోంది. ప్రాజెక్ పూర్తిస్థాయి నీటిమట్టం 80.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 20.006 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

## బిచ్కుంద సీఐగా రవికుమార్

**అక్షరటుడే, బిచ్కుంద:** రాష్ట్రంలో పోలీసుల బదిలీలు కొనసాగుతున్నాయి. ఇటీవల పలువురు సీఐలు, ఎస్సైలు బదిలీ కాగా.. తాజాగా మరో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లకు స్థానం చలనం కల్పిస్తూ పోలీస్ శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మల్టీ జోన్ -1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కామారెడ్డి జిల్లా బిచ్కుంద సీఐ జగడం నరేశ్‌ను బదిలీ చేశారు. ఆయనను ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ఆయన స్థానంలో బిచ్కుంద సీఐగా మంతెన రవికుమార్ రానున్నారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు.

## ఆర్టీసీ టూర్ ప్యాకేజీలకు అపూర్వ స్పందన



**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ డిపో నుంచి నిర్వహిస్తున్న వివిధ రకాల టూర్లకు విశేష స్పందన లభిస్తోందని డిపో మేనేజర్ సరితాదేవి పేర్కొన్నారు. పట్టణంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన యాదగిరి గుట్ట - స్వర్ణగిరి, జరాసంగం - బీదర్ - గానుగాపురం, రామప్ప - లక్నవరం - భద్రకాళి ఆలయ యాత్రలకు మంచి స్పందన లభించిందని పేర్కొన్నారు.

### బిర్లా మందిర్ టూర్..

అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఈనెల 19న బాన్సువాడ - బిర్లా మందిరం సాలార్‌జంగ్ మ్యూజియం ముచ్చింతల్ టూర్ ప్యాకేజీ ఏర్పాటు చేశామని వివరించారు. బాన్సువాడ నుంచి ఉదయం 6 గంటలకు బస్సు బయలుదేరి రాత్రి 12 గంటలకు బాన్సువాడకు చేరుకుంటుందన్నారు. టికెట్ ధర పెద్దలకు రూ.1,000, పిల్లలకు రూ. 500 ఉందని, టికెట్ల కోసం గోపికృష్ణ 9063408477 సంప్రదించాలని కోరారు.

## బూత్ లెవెల్ అధికారులే కీలకం




**అక్షరటుడే, బిచ్కుంద:** భారత ఎన్నికల ప్రక్రియలో బూత్ లెవెల్ అధికారులే కీలకమని స్థానిక సంస్థల ఎన్నికల అధికారి బి.చందర్ అన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎండీ ముజీబ్, నాయబ్ తహశీల్దార్ శివరామకృష్ణ, గిర్దవార్లు శంకర్, సాయిబాబా, రవి, బాలరాజు, దశరథ్, ప్రవీణ్ రెండు మండలాల బీఎల్‌వోలు పాల్గొన్నారు.

కామారెడ్డి జిల్లాలో పేకాట జోరుగా సాగుతోంది. కొందరు శివారు ప్రాంతాలే అడ్డాలుగా మార్చుకుని పత్తాలాట ఆడుతున్నారు. వ్యవసాయ క్షేత్రాలు, ఫామ్‌హౌస్‌లే అడ్డాగా యథేచ్ఛగా పేకాడుతున్నారు. కొందరు బడాబాబులు సైతం ఫామ్‌హౌస్‌లలో పత్తాలు ఆడుతున్నట్లు సమాచారం. కాగా.. కొందరు పేకాట స్థావరాలు సైతం నిర్వహిస్తున్నారు. పోలీసులు అడపాదడపా దాడులు చేస్తున్నా.. పూర్తిస్థాయిలో నియంత్రించడంలో విఫలమవుతున్నారు. – అక్షరటుడే, కామారెడ్డి



# శివారు ప్రాంతాలు.. పేకాట అడ్డాలు..

▸ వ్యవసాయ భూములు, ఫామ్ హౌస్‌లలో జోరుగా
▸ చేతులు మారుతున్న లక్షల రూపాయలు

కామారెడ్డి జిల్లాలో శివారు ప్రాంతాల్లో జూదం విచ్చలవిడిగా సాగుతోంది. పట్టణాలకు దూరంగా ఉన్న వ్యవసాయ భూములు, కొందరు పేరున్న నాయకుల వ్యవసాయ క్షేత్రాలు వీటికి అడ్డాగా మారుతున్నాయి. జల్సాలకు అలవాటు పడిన కొందరు వ్యక్తులు గ్రూపులుగా ఏర్పడి రహస్యంగా జూదం ఆడుతున్నట్టుగా తెలుస్తోంది.

### ప్రత్యేకంగా ఏర్పాట్లు

పేకాట స్థావరాల నిర్వాహకులు జూదం ఆడేవారికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో రహస్యంగా స్థావరాలు ఏర్పాటు చేయడంతో పాటు వారికి కావాల్సినవి సమకూరుస్తున్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలోనే ఓ వ్యవసాయ క్షేత్రంలో ఏకంగా ఏసీలు, సోఫాలు, కుర్చీలు ఏర్పాటు చేసినట్టుగా సమాచారం. ఇక్కడికి బడా నేతలు పేకాట ఆడేందుకు వస్తారని తెలుస్తోంది. అంతేగాకుండా కొందరు పోలీసుల రాకను గమనించేందుకు దారిలో మనుషులను కాపలా పెడుతున్నారు. పోలీసులు రాగానే సమాచారం అందించేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

### వారాంతంలో సందడి

వారం పాటు తమ తమ పనుల్లో ఉండే పలువురు వ్యాపారులు, ఉద్యోగులు, నాయకులు శని, ఆదివారాల్లో పేకాట స్థావరాలకు వెళ్తున్నట్లు సమాచారం. వారాంతంలో వ్యవసాయ క్షేత్రాల్లో సేద తీరడానికి వెళ్లి పేకాడుతూ ఎంజాయ్ చేస్తున్నట్లు తెలిసింది. ఆ సమయంలో మందు, విందు కూడా ఏర్పాటు చేసుకుంటున్నారు. ఫామ్‌హౌస్‌లతో పాటు, వ్యవసాయ భూముల వద్ద చెట్ల కింద సైతం జోరుగా పేకాట ఆడుతున్నారు.



### నిఘా కరువు

కామారెడ్డి పట్టణానికి దూరంగా ఉన్న శివారు ప్రాంతాలపై పోలీసులు నిఘా పెట్టడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా జాతీయ రహదారిపై ఉన్న వ్యవసాయ క్షేత్రాల్లో ఎక్కువగా పేకాట స్థావరాలు నిర్వహిస్తున్నారు. ఈ విషయం తెలిసినా బడా నేతలు, వ్యాపారులే ఉంటారని అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. అప్పుడప్పుడు దాడులు చేసిన సమయంలో బడా బాబులు దొరికితే తమ పలుకుబడి ఉపయోగించి తప్పించుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పలుకుబడి లేని సామాన్యులపై మాత్రం పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు.

### 15 రోజుల్లో ఆరు కేసులు

ఇటీవల జిల్లాలో పోలీసులు పేకాట స్థావరాలపై వరుస దాడులు చేస్తున్నారు. జూన్ 20 నుంచి ఇప్పటివరకు జిల్లాలో సుమారు 6 కేసులు నమోదయ్యాయి. జూన్ 22 న నిజాంసాగర్ పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 40,900 నగదు స్వాధీనం చేసుకున్నారు. జూన్ 23న దోమకొండ మండలం కొనాపూర్‌లో పేకాడుతూ నలుగురు దొరికారు. జులై 6న కామారెడ్డి మండలం నర్సన్నపల్లి శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రంలో ఆరుగురు పేకాట రాయుళ్లు చిక్కారు. వారి నుంచి రూ.18,400 నగదు స్వాధీనం చేసుకున్నారు. అదే రోజు వడ్డేపల్లి శివారులో ఆరుగురిని అరెస్ట్ చేశారు. జులై 8న బాన్సువాడ పట్టణంలో ఐదుగురిని పట్టుకుని వారి వద్ద రూ.20,310 నగదు స్వాధీనం చేసుకున్నారు. అదే రోజు కామారెడ్డి మండలం శాబ్దిపూర్‌లో పేకాడుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేశారు.

### పేకాట స్థావరాలపై నిరంతర దాడులు



పేకాట స్థావరాలపై నిరంతరం దాడులు కొనసాగుతున్నాయి. శివారు ప్రాంతాల్లో పెట్రో వాహనాల్లో తనిఖీలు చేపడుతున్నారు. రోజు రెండుమూడు కేసులు కూడా నమోదు చేస్తున్నాం. పేకాట ఆడుతూ పట్టుబడితే ఎంతటివారైనా వదిలి పెట్టేది లేదు.
- చైతన్య రెడ్డి, ఏఎస్పీ

## కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడాలి

**అక్షరటుడే, కోటగిరి:** కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడాలని ఉమ్మడిజిల్లాల స్పెషల్ ఆఫీసర్ ఒడ్డెన్న పేర్కొన్నారు. ఇంటర్మీడియేట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు కోటగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. అధ్యాపకులతో మాట్లాడి విద్యార్థుల అటెండెన్స్‌ను చెక్ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. స్థానికంగా ప్రభుత్వ స్కూళ్లకు వెళ్లి అక్కడ ఇంకా టీసీ తీసుకోని విద్యార్థులను వివరాలు సేకరించాలన్నారు. ఆ విద్యార్థులను కళాశాలల్లో చేరేవిధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల సంఖ్య పెంచితే ప్రభుత్వం కళాశాలలకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తుందని సూచించారు. కార్యక్రమంలో డీఐఈవో రవికుమార్, కళాశాల ప్రిన్సిపాల్ క్యాసర్ పాషా, ప్రభాకర్, అనిల్, రిజ్వానా, శ్రీలత పాల్గొన్నారు.




## మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా కృష్ణమోహన్ బాధ్యతల స్వీకరణ




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్‌గా డాక్టర్ ఎన్ కృష్ణమోహన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కళాశాల సూపరింటెండెంట్ నాగరాజు, ఉద్యోగులు గురువారం ఆయనకు స్వాగతం పలికారు. కృష్ణమోహన్ ఇదివరకు మహేశ్వరం జిల్లా మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. ప్రమోషన్‌పై రెగ్యులర్ ప్రిన్సిపల్‌గా నిజామాబాద్ కు బదిలీ అయ్యారు. ఇదివరకు ప్రిన్సిపల్‌గా కొనసాగిన డాక్టర్ ఇందిరా ఐదు నెలల క్రితం ఇతర జిల్లా నుంచి బదిలీపై వెళ్లారు. అప్పటినుంచి సైకియాట్రిస్ట్ డాక్టర్ శివప్రసాద్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా కొనసాగుతున్నారు. శివప్రసాద్ నుంచి ప్రిన్సిపల్‌గా కృష్ణ మోహన్ పూర్తి ఛార్జి తీసుకున్నారు.

## మెడికల్ కాలేజీ, జీజీహెచ్ పాలనాధికారుల బాధ్యతల స్వీకరణ


సూపరింటెండెంట్ వెంకటేశ్వర్‌కు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా డా. వాల్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ప్రొఫెసర్లు, వైద్యులు శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల సిబ్బందితో ఆయన ప్రత్యేకంగా సమావేశమై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెడికల్ కళాశాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, భవన నిర్మాణ పనులు త్వరగా చేపట్టి విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు. అలాగే జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ వెంకటేశ్వర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఇన్‌ఛార్జ్‌గా పనిచేసిన డాక్టర్ ఫరీదా బేగం పూర్తిస్థాయి సూపరింటెండెంట్‌గా వచ్చిన డాక్టర్ వెంకటేశ్వర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది సూపరింటెండెంట్ కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.


మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌కు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

## జీజీ కాలేజీ అకడమిక్ కో–ఆర్డినేటర్‌గా నహీదా బేగం

**అక్షరటుడే, ఇందూరు:** గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అకడమిక్ కో-ఆర్డినేటర్‌గా నహీదా బేగంను నియమించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాంమోహన్ రెడ్డి తెలిపారు. అలాగే ఆంగ్ల విభాగాధిపతిగా డాక్టర్ దండు స్వామిని నియమించారు. కార్యక్రమంలో అదనపు పరీక్షల నియంత్రణాధికారి వినయ్ కుమార్, చరిత్ర విభాగాధిపతి రమేష్ గౌడ్, అకాడమిక్ అడిషనల్ కో–ఆర్డినేటర్ వేణుగోపాల్, ఎన్సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



## పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి


మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

**అక్షరటుడే, బోధన్:** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. రెండోవిడత వన మహోత్సవంలో భాగంగా గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా పనిచేస్తే సమస్యలు ఉండవన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎల్లం, కమిషనర్ జాదవ్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## కాలనీలను పరిశుభ్రంగా ఉంచాలి

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలో చెత్తను ఎప్పటికప్పుడు ఎత్తివేస్తూ పరిశుభ్రంగా ఉంచాలని కమిషనర్ దిలీప్ కుమార్ సూచించారు. వందరోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా గురువారం నగరంలోని పలు కాలనీలను సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున నివాస ప్రాంతాల్లో ఫాగింగ్ చేయాలన్నారు. శానిటరీ విభాగం అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ప్రధానంగా ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని సూచించారు. వర్షం నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చూడాలని ఆదేశించారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ రవిబాబు, శానిటరీ సూపర్‌వైజర్ సాజీద్ అలీ, శానిటరీ ఇన్స్పెక్టర్లు జవాన్లు ఉన్నారు.



## కల్లు డిపోలను తనిఖీ చేసిన అధికారులు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని కల్లు డిపోలను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేశారు. డిపోల్లో కల్లు తయారీలో తీసుకుంటున్న జాగ్రత్తలను గురువారం పరిశీలించారు.

### లైసెన్స్‌ల పరిశీలన

నగర పరిధిలోని మూడు కల్లు డిపోలలో లైసెన్స్‌లను అధికారులు పరిశీలించారు. డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్న మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా స్వచ్ఛమైన కల్లునే తయారు చేయాలని తయారీదారులకు సూచించారు.

### ఈత వనం తనిఖీ..

మల్లారంలో 16 ఎకరాల్లో ఉన్న ఈతవనాన్ని ఈ సందర్భంగా ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేశారు. ఈతవనం నుంచే కల్లును సేకరించి విక్రయించాలని తయారీదారులకు సూచించారు. అధికారుల వెంట ఎస్‌హెచ్‌వో సుష్మిత, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది ఉన్నారు.

## బాన్సువాడ ఎంపీడీవోగా ఆనంద్



**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ ఎంపీడీవోగా ఆనంద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మెదక్ జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన బషీరుద్దీన్ ఏప్రిల్‌లో పదవీ విరమణ పొందారు. దీంతో మండల కార్యాలయ సూపరింటెండెంట్ ముజాహిద్ ఇన్ ఛార్జి ఎంపీడీవోగా కొనసాగారు. గురువారం ఛార్జి తీసుకున్న ఎంపీడీవో ఆనంద్ మాట్లాడుతూ.. మండల ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.

## విద్యార్థికి రూ.10 వేల ఆర్థిక సహాయం



**అక్షరటుడే, కోటగిరి :** మండలంలోని శ్రీవేద హైస్కూల్ పూర్వ విద్యార్థిని మమత జేఈఈ మెయిన్స్‌లో మెరుగైన ర్యాంకు సాధించింది. దీంతో ఐఐటీలో సీటు రాగా, గురువారం పాఠశాల యాజమాన్యం ఆమెను అభినందించింది. ఈ సందర్భంగా ఎస్సై సునీల్ చేతులమీదుగా రూ.10వేల నగదు సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థిని ఐఐటీలో సీటు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రవికుమార్, కరస్పాండెంట్ అక్షర, విద్యార్థిని తల్లిదండ్రులు మిట్యానాయక్, శాంతాబాయి, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రానికి నల్లా కనెక్షన్



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని ఏడో వార్డులో అంగన్‌వాడీ కేంద్రానికి నల్లా కనెక్షన్ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. దీంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు పీఏసీఎస్ వైస్ చైర్మన్ ప్రశాంత్ గౌడ్ దృష్టికి తెచ్చారు. ఆయన ఎమ్మెల్యే మదన్మోహన్ రావుకు సమస్య వివరించగా.. పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ మహేశ్‌కు సూచించారు. కాగా.. గురువారం నల్లా కనెక్షన్ ఇచ్చారు. కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్, సతీష్, హీరాలాల్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యలు పరిష్కరించాలి



**అక్షరటుడే, కామారెడ్డి:** రైతుల సమస్యలు పరిష్కరించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో కిసాన్ సంఘ్ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు విద్యుత్ సమస్యలు, యూరియా కొరత లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మేరకు సన్న వడ్లకు రూ.500 బోనస్ అందించాలన్నారు. సమావేశంలో బీకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిరెడ్డి, మండలాధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

## విద్యా సామగ్రి అందజేత



**అక్షరటుడే, భీమ్‌గల్:** మండలంలోని బడా భీమ్‌గల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన కుమ్మరి రాజేశ్వర్ విద్యా సామగ్రిని అందజేశారు. 100 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను అందించినందుకు పాఠశాల హెచ్‌ఎం కృష్ణ స్వామి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు భూపతి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# చెరువు కాదిది.. బస్టాండ్..

- వాన పడితే అధ్వానంగా మారుతున్న గాంధారి ప్రయాణ ప్రాంగణం
- సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేక ప్రయాణికులకు ఇబ్బందులు

**గాంధారి మండల కేంద్రంలోని బస్టాండ్ చిన్నపాటి వర్షా నికి చెరువును తలపిస్తోంది. దీంతో ప్రయాణికుల అవస్థలు పడుతున్నారు. బస్సులు ఎక్కేందుకు, దిగేందుకు ఇబ్బందులు పడుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. - అక్షరటుడే,గాంధారి**



చిన్న వర్షం పడితే చాలు గాంధారి బస్టాండ్ పరిస్థితి అధ్వానంగా మారుతోంది. ప్రయాణ ప్రాంగణం ఆవరణ మొత్తం నీళ్లు నిండిపోతుండడంతో బస్సులు ఎక్కాలంటే ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మురికినీళ్లలో నడుస్తూ ప్రయాణికులు బస్సులు ఎక్కుతున్నా ఆర్టీసీ అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

**డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో..**

బస్టాండ్‌లో నీళ్లు బయటకు వెళ్లేందుకు సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేదు. దీంతో వర్షం నీళ్లన్నీ ప్రాంగణంలోనే నిలిచిపోతున్నాయి. దీంతో దుర్వాసన వస్తోందని.. బస్సులు వచ్చేవరకు అలాగే నిలబడాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే బస్టాండ్ అసౌకర్యాలకు నెలవుగా మారిందని వారు పేర్కొంటున్నారు.

**కామారెడ్డి, బాన్సువాడకు మిడిల్ పాయింట్..**

నిత్యం రద్దీగా ఉండే బస్టాండ్ అటు కామారెడ్డికి ఇటు బాన్సువాడకు మధ్యలో ఉంటుంది. చాలామంది ప్రయాణికులు వయా గాంధారి ద్వారా బాన్సువాడ నుండి కామారెడ్డికి చేరుకుంటారు. లేదంటే బాన్సువాడ నుంచి నిజామాబాద్, నిజామాబాద్ నుండి కామారెడ్డికి చాలా దూరం అవుతుంది. కాబట్టి ప్రయాణికులు ఎక్కువమంది ఈ మార్గాన్ని ఎంచుకుంటారు. సుమారు 800మంది వరకు నిత్యం ఈ బస్టాండ్ నుంచి రాకపోకలు సాగిస్తుంటారు.


### డ్రెయినేజీ సమస్య ఉంది

వాస్తవానికి గాంధారి బస్టాండ్‌లో వర్షం పడితే నీళ్లు బయటకు వెళ్లేందుకు డ్రెయినేజీ వ్యవస్థ లేదు. అలాగే ప్రయాణికులకు తాగునీటిని అందుబాటులో ఉంచుతాం. అంతే కాకుండా డ్రెయినేజీ వ్యవస్థ బాగుచేయించేందుకు కృషి చేస్తాం.

– ఉమాపతి, ఆర్టీసీ కంట్రోలర్

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని కాలనీల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కాలనీవాసులు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రాజు పేర్కొన్నారు. పట్టణంలోని 1, 16వ వార్డుల్లో ఘన వ్యర్థ్యాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఇంటింటికీ తిరుగుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని, సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని అవగాహన కల్పించారు. వీధి కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేష్, వార్డు ఆఫీసర్లు యుగంధర్, అవినాష్, శానిటరీ జవాన్లు, మెప్మా ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.



## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు. బాన్సువాడ మండల కార్యాలయంలో డివిజన్‌లోని అన్ని మండలాల వైద్యాధికారులు, ఎంపీడీవో, ఎంపీవో, ఎంఈవో, మున్సిపల్ కమిషనర్లతో గురువారం సమీక్ష నిర్వహించారు. తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఇళ్ల పరిసరాల్లో చెత్తాచెదారం నిల్వకుండా చూడాలని చెప్పారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ



**అక్షరటుడే, భీమ్‌గల్:** మండలంలోని బడా భీమ్‌గల్ గ్రామంలో పలు బాధిత కుటుంబాలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి గురువారం పరామర్శించారు. ఇటీవల మరణించిన బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకులు మాంద్ర సుమన్ తల్లి, శంకూరి దేవేందర్ తండ్రి, ప్రేమ్ చంద్ తండ్రి మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే గ్రామానికి చెందిన మల్లెల శ్రీకాంత్ తండ్రికి రోడ్డు ప్రమాదంలో గాయాలవడంతో ఆయనను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దొనకొండ నరసయ్య, మాజీ ఎంపీపీ ఆర్మూర్ మహేష్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చౌటుపల్లి రవి, మాజీ ఎంపీటీసీ పసుల ముత్తన్న, స్థానిక నాయకులున్నారు.

## జేసీఐ ఇందూరు సేవలు అభినందనీయం

**అక్షరటుడే, ఇందూరు:** జేసీఐ ఇందూరు చేస్తున్న సేవలు అభినందనీయమని సంస్థ జాతీయ అధ్యక్షుడు అంకుర్ జున్‌జున్‌వాలా ప్రశంసించారు. సికింద్రాబాద్‌లోని లయన్స్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జేసీఐ ఇందూరు చేపడుతున్న కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని పేర్కొంటూ జేసీఐ ఇందూరు అధ్యక్షురాలు గౌతమి పెందోటిని, జోన్ అధికారి నయన్‌ను అభినందించారు. జేసీఐ పిన్‌తో సత్కరించారు. కార్యక్రమంలో జోన్-12 అధ్యక్షుడు చతుర్వేది, జాతీయ కోఆర్డినేటర్ బంటు కిరణ్, జోన్ అధికారులు, జయంత్‌శెట్టి, రామకృష్ణ, ఇందూరు పూర్వాధ్యక్షుడు చంద్రశేఖర్ పెందోటి, జూన్-12 క్లబ్‌ల అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.




## న్యూసెన్స్ కేసులో ఒకరికి ఏడురోజుల జైలు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** మద్యం తాగి న్యూసెన్స్ కేసిన కేసులో ఒకరికి ఏడు రోజుల జైలుశిక్ష విధించినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన షేక్ ఫెరోజ్ (30) మద్యం తాగి న్యూసెన్స్ చేయడంతో శాంతిభద్రతం విఘాతం కలిగించాడు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి గురువారం కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. విచారించిన స్పెషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ నిందితుడికి ఏడు రోజుల జైలుశిక్ష విధించినట్లు వెల్లడించారు.

## డ్రంకన్ డ్రైవ్ కేసులో నలుగురికి జైలు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో నలుగురికి జైలుశిక్ష, ఏడుగురికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఇటీవల డ్రంకన్ డ్రైవ్‌లో 11 మంది వాహనదారులు పట్టుబడ్డారు. ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ ఆదేశాల మేరకు వారికి గురువారం కౌన్సెలింగ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. అనంతరం జిల్లా సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చగా, నలుగురికి జైలుశిక్ష, ఏడుగురికి రూ.1,500 చొప్పున జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి



నిజామాబాద్ సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు..



బాన్సువాడలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పోచారం

**ఉమ్మడిజిల్లాలో గురుపౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. సాయిబాబా విగ్రహాలకు క్షీరాభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పలువురు తమ గురువులను ఘనంగా సన్మానించారు.**

– అక్షరటుడే, నెట్‌వర్క్




నగరంలో దయానంద యోగా ట్రస్ట్ ఆధ్వర్యంలో..



నిజాంసాగర్ మండల కేంద్రంలో..



బీబీపేట మండల కేంద్రంలో..



లింగంపేట మండలంలో..

## ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో యువకుడి ఆత్మహత్యాయత్నం

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఉదయం ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. నగరానికి చెందిన బాలాజీ అనే యువకుడు పాలిటెక్నిక్ కాలేజీకి ఆనుకుని పానీ పూరి బండి నడుపుతూ జీవిస్తున్నాడు. అయితే ఇటీవల నగరానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాగా.. పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో సభ నిర్వహించారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు బాలాజీ పానీ పూరి బండిని అక్కడి నుంచి తీసేయించారు. అమిత్ షా పర్యటన ముగిసిన తర్వాత మళ్లీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ క్రమంలో తన పానీపూరి బండి పెట్టుకుంటానని గురువారం ఉదయం బాలాజీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి అడిగాడు. అయితే అందుకు పోలీసులు అనుమతించకపోవడంతో మనస్థాపానికి గురయ్యాడు. తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. దీంతో అక్కడే ఉన్న పోలీసులు అతడిని అడ్డుకున్నారు.

## నగరంలో భారీ అగ్నిప్రమాదం



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నగరంలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఆటో నగర్‌లో ఈ ప్రమాదం సంభవించింది. స్క్రాప్ గోదాంలో ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగాయి. అలాగే పక్కనే ఉన్న బీరువాలు తయారీ చేసే గోదాంలోకి మంటలు వ్యాపించాయి. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ ఆధ్వర్యంలో రెండు ఫైర్ ఇంజన్లతో సుమారు పది మంది సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. కాగా.. ప్రమాదంలో రూ. 10 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శంకర్ తెలిపారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయని చెప్పారు.